

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



సెప్టెంబర్ 24 గురువారం 2026 | సంపుటి : 18 | సంచిక : 231 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

THURSDAY SEPTEMBER 24 2026 | VOL:18 | ISSUE: 231 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

అక్టోబర్ జీతంతో తొలి డీఏ చెల్లింపు.. ఉగాది సందర్భంగా రెండో డీఏ విడుదల

ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సీఎస్ సమావేశం.. డీఏలపై కీలక నిర్ణయం

పీఆర్సీపై కొనసాగుతున్న ఎదురుచూపులు.. తదుపరి నిర్ణయంపై ఉద్యోగుల్లో ఆసక్తి



హైదరాబాద్, సెప్టెంబర్ 23:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమై ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లపై చర్చించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల విడుదలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఉద్యోగ సంఘాలు చాలాకాలంగా డీఏల విడుదల కోసం ప్రభుత్వాన్ని కోరుతున్న నేపథ్యంలో తాజా నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా డీఏను సకాలంలో విడుదల చేయాలని ఉద్యోగ సంఘాలు గతంలో పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాయి. ఈ క్రమంలో ప్రభుత్వం రెండు డీఏలను విడుదల చేసేందుకు అంగీకరించడం ఉద్యోగులకు కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది.

అక్టోబర్ జీతంతో తొలి డీఏ

ప్రభుత్వం ఆమోదించిన రెండు డీఏల్లో మొదటి డీఏను అక్టోబర్ నెల జీతంతో కలిపి చెల్లించేందుకు నిర్ణయించినట్లు సమావేశంలో స్పష్టత వచ్చింది. దీంతో చాలాకాలంగా డీఏ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థికంగా కొంత ప్రయోజనం లభించనుంది. అక్టోబర్ జీతంతోనే తొలి డీఏ అందుబాటులోకి

(మిగతా 2వ పేజీలో..)

'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం': ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ ఫైర్

'సర్' వివాదం నేపథ్యంలో ఈసీపై రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు

'ఓటు చోరీ' రాజ్యాంగంపై దాడి అని వ్యాఖ్య

ఇద్దరు ఈసీల అభ్యంతరాలపై మీడియాలో కథనం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు

10 నెలల్లో 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తమైనట్లు కథనం

ఎలాంటి అధికారిక భిన్నాభిప్రాయం లేదని ఈసీ స్పష్టీకరణ

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై వివాదం కొనసాగుతున్న వేళ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం అధికారులు చేస్తున్నది తప్పని వ్యాఖ్యానిస్తూ.. 'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం' అంటూ హెచ్చరించారు. 'ఓటు చోరీ' భారత ప్రజల పట్ల నేరమని, రాజ్యాంగంపై నేరుగా దాడి చేయడమేనని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఓ వీడియోను కూడా రాహుల్ గాంధీ పంచుకున్నారు. "ఎన్నికల సంఘానికి, ఎన్నికల అధికారులకు స్పష్టంగా చెబుతున్నా.. మీరు చేస్తున్నది తప్పు. ఇది దేశద్రోహం.

(మిగతా 2వ పేజీలో..)



భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్.. ఊడిపడిన ప్లాస్టరింగ్


హైదరాబాద్‌లో భారీ వర్షాల కారణంగా చార్మినార్‌కు స్వల్ప నష్టం

లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడిపడిన వైనం

మరమ్మతుల కోసం ఇప్పటికే టెండర్ ప్రక్రియలో ఉందని ఏఎస్ఐ వెల్లడి

శనివారం వరకు భారీ వర్ష సూచనతో అప్రమత్తమైన అధికారులు

(మిగతా 2వ పేజీలో..)



ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో: రాష్ట్రంలో కరెంట్ కోతలపై కేటీఆర్

రాష్ట్రంలో కరెంట్ కోతలకు 'కాంగ్-నినో' కారణమన్న కేటీఆర్

సింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణ

కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయిందంటూ ప్రభుత్వానికి చురక

రైతులకు 24 గంటల విద్యుత్ హామీని నెరవేర్చాలని డిమాండ్



రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది 'ఎల్ నినో' ప్రభావం కాదని, పాలకుల అసమర్థత వల్లే తలెత్తిన 'కాంగ్-నినో' (కాంగ్రెస్ నినో) అని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. "కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ కోతలు తప్పవని తాము ముందే హెచ్చరించామని, ఇప్పుడు అదే నిజమవుతోందని" కేటీఆర్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది" అంటూ ఆయన ప్రభుత్వానికి చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా నడిచిందని, కానీ కాంగ్రెస్ పాలనలో పరిస్థితి దారుణంగా మారిందని విమర్శించారు. అనేక సబ్‌స్టేషన్ల పరిధిలో రోజుకు 6 గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని పత్రికల్లో వస్తున్న కథనాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యుత్ కోతలకు ప్రభుత్వం ఎల్ నినోను సాకుగా చూపుతోందని, అయితే అసలు కారణం ప్రభుత్వ వైఫల్యమేనని

(మిగతా 2వ పేజీలో..)

రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత

ఐదుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోతే రేవంత్ కు పరామర్శించే సమయం కూడా లేకపోయిందని మండిపాటు

నెల రోజుల్లోగా ప్రభుత్వ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని హెచ్చరిక



ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటుచేసుకున్న ఏసీ పేలుడు ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ఘటనలో

(మిగతా 2వ పేజీలో..)

బెంగాల్‌లో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించండి.. సీఈసీపై విమర్శల నేపథ్యంలో మమత డిమాండ్

పాత ఓటర్ల జాబితాతో బెంగాల్‌లో మళ్లీ ఎన్నికలు జరపాలని మమత డిమాండ్

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేయాలని మమత వ్యాఖ్య

దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని మమత ప్రకటన

30 లక్షల ఓటర్ల పేర్లు తొలగించారని అభిషేక్ ఆరోపణ

ఇద్దరు ఈసీలు 'సర్'పై అభ్యంతరాలు తెలిపినట్లు వార్తల నేపథ్యంలో వ్యాఖ్యలు



పశ్చిమ బెంగాల్‌లో మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) వివాదం మరోసారి ముదురుతోంది. 'సర్' సహా ఓటర్ల తొలగింపు, చేర్పు వంటి కీలక నిర్ణయాలపై ఎన్నికల సంఘం కమిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారన్న వార్తలు దీనికి ఆజ్యం పోశాయి. ఈ నేపథ్యంలో మాజీ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. పాత ఓటర్ల జాబితాతో బెంగాల్‌లో మరోసారి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్ట్ చేయాలని కోరారు. జ్ఞానేశ్ కుమార్ సీఈసీగా ఉన్నంతకాలం దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ప్రకటించారు.

(మిగతా 2వ పేజీలో..)



విజయకెరటం
తెలుగు దినపత్రిక

సం పా ద కీ యం

రాజకీయ బలం.. గ్రామాల్లోనే పునాది!

రాజకీయాల్లో కొత్త పార్టీకి ఆవిర్భావం ఎంత ముఖ్యమో.. దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం అంతకంటే పెద్ద సవాలు. నాయకుడి వ్యక్తిగత ఇమేజ్, భారీ సభలు, అనుచరుల హడావుడి కొంతకాలం రాజకీయ ఉత్సాహాన్ని కలిగించవచ్చు. కానీ దీర్ఘకాల రాజకీయ ప్రయాణానికి మాత్రం గ్రామస్థాయి నుంచి నిర్మించుకున్న బలమైన సంస్థాగత వ్యవస్థే కీలకం. అందుకే కొత్త రాజకీయ శక్తులు ముందుగా తమకు బలమైన ప్రాంతాల్లో పట్టు సాధించి, ఆ తర్వాత క్రమంగా ఇతర నియోజకవర్గాలకు విస్తరించే వ్యూహాన్ని అనుసరిస్తుంటాయి.

ఒక పార్టీకి నిజమైన బలం నాయకుల చేరికల సంఖ్యతో నిర్ణయించబడదు. గ్రామాల్లో ఎంతమంది కార్యకర్తలు ఉన్నారు? ప్రజల సమస్యలపై ఎవరు స్పందిస్తున్నారు? స్థానికంగా పార్టీకి ప్రజలతో ఎలాంటి సంబంధం ఉంది? అనే అంశాలే అసలు కొలమానం. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల మధ్యకు వెళ్లే రాజకీయాల కంటే.. నిత్యం ప్రజలతో మమేకమై పనిచేసే రాజకీయాలకే విశ్వసనీయత లభిస్తుంది.

మహిళలకు అవకాశాలు.. యువతకు ప్రాధాన్యం

రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం అవసరం. మహిళలకు పదవులు కేటాయించడం మాత్రమే కాకుండా నిర్ణయాలు తీసుకునే స్థాయిలో వారికి అవకాశం కల్పించాలి. ముఖ్యంగా యువ మహిళలను గ్రామస్థాయి నుంచి రాజకీయాల్లోకి తీసుకురావడం ద్వారా కొత్త తరానికి నాయకత్వ అవకాశాలు లభిస్తాయి.

అలాగే యువతను కేవలం ఎన్నికల ప్రచారానికి పరిమితం చేయకుండా పార్టీ విధానాల రూపకల్పనలోనూ భాగస్వాములను చేయాలి. ఉద్యోగాలు, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, పట్టణ సమస్యలు వంటి అంశాలపై యువతకు స్పష్టమైన రాజకీయ వేదిక అవసరం.

చేరికల కంటే ప్రజా సమస్యలే ముఖ్యం

ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి నాయకులు మారడం రాజకీయాల్లో సహజమే. అయితే ప్రతి చేరికను రాజకీయ విజయంగా భావించడం సరైనది కాదు. చేరిన నాయకుడు ప్రజల్లో ఎంత ప్రభావం చూపగలడు? అతని వెంట నిజంగా ఎంతమంది కార్యకర్తలు ఉన్నారు? అనే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

ప్రజల సమస్యలను పక్కనపెట్టి కేవలం ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు చేయడం ద్వారా దీర్ఘకాల రాజకీయ బలం సాధ్యం కాదు. రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పష్టమైన విధానాలను ప్రకటించాలి. ప్రజలకు ప్రత్యామ్నాయ కార్యాచరణ చూపించగలిగినప్పుడే కొత్త రాజకీయ శక్తికి ప్రత్యేక గుర్తింపు వస్తుంది.

అధికార పార్టీలకు ఆత్మపరిశీలన అవసరం

కొత్త రాజకీయ శక్తులు బలపడుతున్నాయంటే అధికార పార్టీలకు కూడా అది ఒక సంకేతం. ప్రజల్లో అసంతృప్తికి కారణాలేమిటి? కార్యకర్తల్లో అసంతృప్తి ఎందుకు ఏర్పడుతోంది? స్థానిక నాయకత్వం ప్రజలకు అందుబాటులో ఉందా? ప్రభుత్వ పథకాల అమలులో లోపాలున్నాయా? వంటి అంశాలను అధికార పార్టీలు పరిశీలించాలి.

ప్రజలతో సంబంధం తగ్గినప్పుడు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులకు అవకాశం ఏర్పడుతుంది. అందుకే అధికారంలో ఉన్న పార్టీలు కూడా ప్రజల్లో నిరంతరం ఉండాలి. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజల వ్యక్తిగత, స్థానిక సమస్యలకు స్పందించే వ్యవస్థను బలోపేతం చేయాలి.

తీర్పు ప్రజలదే

సభలకు వచ్చే జనసందోహం, నాయకుల చేరికలు, సోషల్ మీడియా ప్రచారం, రాజకీయ వ్యూహాలు.. ఇవన్నీ ఎన్నికల వాతావరణాన్ని ప్రభావితం చేసే అంశాలే. కానీ ఒక పార్టీకి ఎంత ప్రజాదరణ ఉందో తుది నిర్ణయం మాత్రం ప్రజలదే.

అందుకే రాజకీయ పార్టీలు వ్యక్తిగత విమర్శలు, ఆరోపణల కంటే ప్రజా సమస్యలు--విధానాలు--అభివృద్ధి చుట్టూ రాజకీయ పోటీని కొనసాగించాలి. గ్రామాల్లో పట్టు సాధించడం, కార్యకర్తలను గౌరవించడం, మహిళలు--యువతకు అవకాశాలు కల్పించడం, ప్రజల మధ్య నిరంతరం ఉండడం ద్వారానే రాజకీయ బలం పటిష్ఠమవుతుంది.జెండా ఎగరేయడం కంటే.. ఆ జెండా కింద ప్రజలు నిలబడేలా విశ్వాసాన్ని సంపాదించడమే అసలైన రాజకీయ విజయం.

తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

మొదటి పేజీ తరువాయి)

రానుండటంతో ఉద్యోగ వర్గాల్లో సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. అయితే డీఏ శాతం, బకాయిల చెల్లింపు విధానం, అమలుకు సంబంధించిన పూర్తి ఉత్తర్వులు వెలువడిన తర్వాతే ఉద్యోగులకు లభించే ఖచ్చితమైన ఆర్థిక ప్రయోజనంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఉగాది సందర్భంగా రెండో డీఏ

రెండో డీఏను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. అంటే ఉద్యోగులకు రెండు విడతల్లో డీఏ ప్రయోజనం అందనుంది. ఒక డీఏను అక్టోబర్ జీతంతో చెల్లించగా.. మరో డీఏను ఉగాది సమయంలో విడుదల చేయడం ద్వారా పెండింగ్‌లో ఉన్న డీఏలను దశలవారీగా పరిష్కరించే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.చాలాకాలంగా డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగ సంఘాలు ఈ అంశాన్ని ప్రధాన డిమాండ్‌గా ముందుకు తీసుకెళ్లాయి. తాజా సమావేశంలో ప్రభుత్వం రెండు డీఏలకు అంగీకరించడంతో ఈ అంశంపై కొంతకాలంగా కొనసాగుతున్న అనిశ్చితికి తెరపడినట్లయింది.

పీఆర్సీపై మాత్రం స్పష్టత కరువు

మరోవైపు ఉద్యోగులు ప్రధానంగా కోరుతున్న పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) అంశంపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టమైన నిర్ణయం ప్రకటించలేదు. డీఏలతో పాటు పీఆర్సీని కూడా అమలు చేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి. ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించిన పీఆర్సీపై ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందనే అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.డీఏల విడుదలకు ప్రభుత్వం అంగీకరించినప్పటికీ.. పీఆర్సీపై నిర్ణయం వాయిదా పడటంతో ఉద్యోగ సంఘాల తదుపరి కార్యాచరణపై ఆసక్తి నెలకొంది. పీఆర్సీపై ప్రభుత్వం త్వరలోనే స్పష్టత ఇస్తుందా? ఉద్యోగ సంఘాలతో మరోసారి చర్చలు నిర్వహిస్తుందా? అనే అంశాలపై ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఉద్యోగ సంఘాల డిమాండ్లపై చర్చ

సీఎస్‌తో జరిగిన సమావేశంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తమ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. డీఏలు, పీఆర్సీతో పాటు ఉద్యోగులకు సంబంధించిన ఇతర సమస్యలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయాన్ని ఉద్యోగ సంఘాలు ఎలా స్వీకరిస్తాయన్నది కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. డీఏల విషయంలో నిర్ణయం వెలువడటంతో ఉద్యోగులపై కొంతకాలంగా ఉన్న ఆర్థిక ఒత్తిడి తగ్గే అవకాశం ఉంది. అయితే పూర్తి ప్రయోజనం ఎప్పుడు, ఏ విధంగా అందుతుంది అన్నది ప్రభుత్వం జారీ చేసే అధికారిక ఉత్తర్వుల ద్వారా మరింత స్పష్టమవుతుంది. రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఉద్యోగుల్లో కొంత ఊరట కనిపిస్తున్నప్పటికీ.. పీఆర్సీపై నిర్ణయం కోసం వారి ఎదురుచూపులు మాత్రం కొనసాగనున్నాయి.

భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్.. ఊడిపడిన ప్లాస్టరింగ్

భాగ్యనగరంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో చారిత్రక కట్టడం చార్మినార్ స్వల్పంగా దెబ్బతింది. మంగళవారం రాత్రి పాతబస్తీలో సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వానకు లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది.సమాచారం అందుకున్న చార్మినార్ భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, కిందపడిన ప్లాస్టరింగ్ శకలాలను తొలగించారు. మంగళవారం సాయంత్రం నగరంలో 37.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ వర్షం కారణంగానే మినార్ ప్లాస్టరింగ్ ఊడిపడి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.ఈ ఘటనపై భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు స్పందించారు. ఎడమవైపు మినార్ కింద ఉన్న గోడ వెలుపలి భాగం కొంత బలహీన పడటంతో భారీ వర్షానికి ప్లాస్టరింగ్ రాలిపోయిందని వారు తెలిపారు. దెబ్బతిన్న భాగానికి మరమ్మతులు నిర్వహించేందుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు.ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల్లో అత్యధికంగా సంగారెడ్డిలో 82.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు, ఈ నెల 26వ తేదీ శనివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చార్మినార్‌తో పాటు ఇతర చారిత్రక కట్టడాల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులు నిర్ణయించారు.

రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

మొదటి పేజీ తరువాయి)

ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవధిలోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్ర నిధుల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘెరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

'సమయం వస్తుంది.. మిమ్మల్ని వదలం': ఎన్నికల సంఘంపై రాహుల్ గాంధీ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

సమయం వస్తుంది. మిమ్మల్ని పట్టుకుంటాం. తప్పించుకోలేరు" అని అందులో పేర్కొన్నారు.ఈ వ్యాఖ్యలకు కారణమైన వివాదం ఓ పత్రిక ప్రచురించిన పరిశోధనాత్మక కథనంతో మొదలైంది. పది నెలల వ్యవధిలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలు నిర్ణయాలపై కనీసం 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు ఆ కథనం పేర్కొంది. కొత్త ఓటర్ల చేర్పు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ వంటి అంశాలు అందులో ఉన్నట్లు తెలిపింది.అయితే ఈ కథనాన్ని ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఇద్దరు కమిషనర్లు కొన్ని అంశాలపై అభిప్రాయాలు, సూచనలు మాత్రమే చేశారని.. అధికారికంగా ఎలాంటి భిన్నాభిప్రాయం నమోదు కాలేదని ఈసీ వర్గాలు తెలిపాయి. 'సర్' సహా అన్ని నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఆమోదంతో ఏకగ్రీవంగానే తీసుకున్నట్లు స్పష్టం చేశాయి. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. ఇటీవలి సంవత్సరాల్లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ పార్లమెంటరీ కమిటీ సమీక్షించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న 'సర్' ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరారు.

బెంగాల్‌లో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించండి.. సీఈసీపై విమర్శల నేపథ్యంలో మమత డిమాండ్

మొదటి పేజీ తరువాయి)

ఈ అంశంపై ఇండియా కూటమి భాగస్వామ్యులతో చర్చించామన్నారు. త్వరలో సమావేశం అవుతామని తెలిపారు. టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కూడా ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీకి ప్రయోజనం చేకూర్చేందుకు బెంగాల్ ఓటర్ల జాబితా నుంచి 30 లక్షల పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారని ఆరోపించారు. హర్యానా, బీహార్‌లోనూ ఇలాంటి చర్యలు జరిగాయని అన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ఎన్నికల సంఘం వ్యవహారాలపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అయితే ఎన్నికల సంఘం ఈ ఆరోపణలను ఖండించింది. 'సర్' సహా అన్ని కీలక నిర్ణయాలు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదంతోనే తీసుకున్నామని స్పష్టం చేసింది. అధికారులు చర్చల సమయంలో వివిధ అభిప్రాయాలు, సూచనలు ఇవ్వడం సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగమేనని తెలిపింది. ఓటర్ల హక్కులను కాపాడేందుకే ఈ ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొంది.

ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో: రాష్ట్రంలో కరెంట్ కోతలపై కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ ఆరోపించారు. జెన్‌కో వద్ద తగినంత బొగ్గు నిల్వలు లేవని, సింగరేణి నుంచి ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ థర్మల్ విద్యుత్ కేంద్రాలను, నీరు లేదన్న సాకుతో జల విద్యుత్ కేంద్రాలను మూసివేశారని దుయ్యబట్టారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

ఎంజీఎంపై ప్రశ్నిస్తే అరెస్టులా?

వైద్య వ్యవస్థను గాడిలో పెట్టాలి..

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలి: నన్నపునేని నరేందర్

వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 23 :

ఎంజీఎం ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై ప్రశ్నిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌పై పోలీసుల చర్యలు అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ప్రజా సమస్యలపై నిలదీస్తే అరెస్టులు చేస్తారా? అని ప్రశ్నించారు. పాలకుల అండతోనే నగరంలో దాడుల సంస్కృతి పెరుగుతోందని ఆరోపించారు.బుధవారం వరంగల్ శివనగర్‌లోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మీడియాతో మాట్లాడుతూ ఎంజీఎం ఆస్పత్రిలో వైద్య వ్యవస్థ పూర్తిగా గాడితప్పిందని విమర్శించారు. రోగులను తరలించేందుకు స్ట్రెచర్లు, సెలైన్ స్టాండ్లు సక్రమంగా లేకపోవడం, ఎక్స్‌రే యంత్రాలు పనిచేయకపోవడం, ల్యాబ్‌లలో సేవలు నిలిచిపోవడం వంటి సమస్యలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.వెయ్యి పడకల ఆస్పత్రిలో సరిపడా సిబ్బంది లేకపోవడం, అవసరమైన వైద్య పరికరాలు పనిచేయకపోవడం, రక్త పరీక్షలకు ఇబ్బందులు, ఆపరేషన్ థియేటర్లలో ఏసీలు పనిచేయకపోవడం వంటి సమస్యలు నెలకొన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలు లేక రోగులను ప్రైవేట్ ల్యాబ్‌లు, ఆస్పత్రులకు పంపుతున్నారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.ఇటీవల ఎంజీఎంలో వరుసగా పైకప్పు పెచ్చులు ఊడిపడి రోగులు, సహాయకులు గాయపడిన ఘటనలను ప్రస్తావిస్తూ.. కలెక్టర్, డీఎంఈ తదితర అధికారులు తనిఖీలు చేసినా సమస్యలకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని నరేందర్ విమర్శించారు. రోగుల భద్రతపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఎంజీఎం పరిస్థితిపై ప్రశ్నించేందుకు వెళ్లిన



వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రజల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం తగదని విమర్శించారు.కేసీఆర్ హయాంలో నిర్మించిన 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నరేందర్ డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీలో అక్రమాలపై విచారణ జరిపి, ఎంజీఎంలోని ఖాళీ పోస్టులను భర్తీ చేసి, అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఎంజీఎం సమస్యలపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పరకాలలో ఘనంగా గణేష్ నిమజ్జనం





గణనాథుల శోభాయాత్రతో సందడిగా పట్టణం..

వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 23:

హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలో గణేష్ నిమజ్జన వేడుకలు బుధవారం మధ్యాహ్నం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. గణనాథుల శోభాయాత్రలతో పట్టణంలోని ప్రధాన వీధులు సందడిగా మారాయి. డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భక్తుల నృత్యాలతో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులు భక్తిశ్రద్ధలతో గణనాథులను నిమజ్జనానికి తరలించారు.నిమజ్జనానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. రాత్రి వేళల్లోనూ నిమజ్జనం కొనసాగే అవకాశం ఉండటంతో చెరువుల వద్ద లైటింగ్ ఏర్పాటు చేశారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు, బారికేడ్లు, రెస్క్యూ ఏర్పాట్లు చేశారు. భారీ విగ్రహాలను సురక్షితంగా నిమజ్జనం చేసేందుకు ప్రత్యేక క్రేన్లను ఏర్పాటు చేయడంతో పాటు ఈతగాళ్లు, రెస్క్యూ బృందాలను అందుబాటులో ఉంచారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లు చేపట్టారు.ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్ ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. పరకాల ఏసీపీ పి.సతీష్‌బాబు, సీఐ ఏ.ప్రవీణ్‌కుమార్, ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునిల్‌కుమార్, కుంకుమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు ఏర్పాట్లను పరిశీలించారు.కౌన్సిలర్లు కొయ్యడ శ్రీనివాస్,బండి శ్రీధర్, సుధమల్ల రమేష్, బొచ్చు సల్మాన్,బాబురావు,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఒంటేరు శ్రావణ్,ఆలయ కమిటీ డైరెక్టర్లు జి.సత్యనారాయణ,నవీన్, రాము, సీనియర్ నాయకులు ఏకు విద్యాసాగర్, మొగిలి, 4వ వార్డు అధ్యక్షుడు బొచ్చు కుమార్, వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ జిల్లాలో గణేష్ నిమజ్జనానికి, శోభాయాత్రకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి జిల్లా కలెక్టర్





నల్లగొండ సెప్టెంబర్ 23 విజయ కెరటం ప్రతినిధి.

బుధవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్ లోని ఒకటో నెంబర్ వినాయక విగ్రహం వద్ద పూజలు నిర్వహించి శోభ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర రోడ్డు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,నల్గొండ మేయర్ ఇతర ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు జిల్లాలో వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశామని, జిల్లా వ్యాప్తంగా సుమారు 6000 విగ్రహాలు ఉన్నాయని, గడచిన 5 రోజుల నుండి నిమజ్జన ప్రదేశాలకు వినాయక విగ్రహాలు వస్తున్నాయని, బుధవారం నుండి శుక్రవారం వరకు మరో 2000 విగ్రహాలు నిమజ్జనం జరిగే అవకాశం ఉందని తెలిపారు. శోభాయాత్రను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రదేశాలలో ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని ,ముఖ్యంగా శాంతి కమిటీ, గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అన్ని నిమజ్జన ప్రదేశాల వద్ద వైద్య బృందాలు, రెవెన్యూ, పోలీస్ తో పాటు ,ఇతర శాఖల అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేశామని, భక్తులందరూ భక్తిశ్రద్ధలతో శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేయడంలో జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనంలో భాగంగా బుధవారం ఒక్కరోజే 2000 వినాయక విగ్రహాలు జిల్లాలోని 8 నిమజ్జన ప్రదేశాలలో నిమజ్జనం జరిపెందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. వినాయక శోభాయాత్రకు, విగ్రహాల నిమజ్జనానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని, శోభయాత్ర శాంతియుత వాతావరణంలో కొనసాగేలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, 14 మైలురాయి వద్ద నీళ్లు ఉన్నాయని, విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు.నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,అడిషనల్ ఎస్పీ రమేష్, నల్గొండ ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

భద్రకాళి నగర్ లో ఘనంగా వినాయక ఉద్వాసన కార్యక్రమం

హనుమకొండ సెప్టెంబర్ 23 విజయ కెరటం ప్రతినిధి



భీమారం 55వ డివిజన్ భద్రకాళి నగర్ 2 లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లేపు రాజు తెలిపారు. వంచ సుధీర్ రెడ్డి, వంగాల సంపత్ రెడ్డి ఆరే శ్రీకాంత్ రెడ్డి,జిల్లెల సుధాకర్ రెడ్డి, మిట్టపల్లి ప్రవీణ్, వర్ధిల్లి మలహోత్రావు, ముగ్ధపూ నరేంద్ర జాలిగం తిరుపతి, మధుకర్ రెడ్డి చెప్పాల రవికుమార్, పోరండ్ల ప్రభాకర్, గబ్బిట కుమార స్వామి, కుమ్మరి వెంకటేశ్వర్లు, కుసుంబ సత్యనారాయణ లు పాల్గొన్నట్లు తెలిపారు.9 నవరాత్రులు అకుంఠిత దీక్షతో విజయవంతంగా కార్యక్రమం నిర్వహించినట్లు శ్రీ నాగిళ్ళ వేణు శర్మ గారి ఆధ్వర్యంలో విగ్రహ దాత శ్రీనివాసరెడ్డి మరియు కాలనీ వాసుల సహకారం 9 రోజుల పాటు పూర్తి సమయం వెచ్చించి నవరాత్రుల్లో పాల్గొన్న కాలనీ వాసులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఎల్ నినో ప్రభావంతో కరువును ఎదుర్కొనేందుకు ఇంజనీర్ల సూచనలు అవసరం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

- **ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ భవన్‌లో నిర్వహించిన "ఎల్ నినో ఎఫెక్ట్ -- సాగునీటిరంగం ం వ్యవసాయం" కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



హైదరాబాద్ సెప్టెంబర్ 23 విజయ కెరటం ప్రతినిధి



ఈ సందర్భంగా ప్రముఖ ఇంజనీర్ గుర్రం కోటిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం గుర్రం కోటిరెడ్డి మెమోరియల్ అవార్డు గ్రహీతలను సన్మానించి అవార్డులు అందజేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కరువును ఎదుర్కొనేందుకు ఇంజనీర్లు తమ విలువైన సూచనలు, సలహాలను ప్రభుత్వానికి అందించాలని మంత్రి కోరారు. ఇంజనీర్లు లేనిదే దేశ అభివృద్ధి సాధ్యం కాదని, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఇంజనీర్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.ఎల్ నినో ప్రభావంతో కరువును ఎదుర్కొనేందుకు ఇంజనీర్ల సూచనలు అవసరం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ భవన్‌లో నిర్వహించిన "ఎల్ నినో ఎఫెక్ట్ -- సాగునీటిరంగం వ్యవసాయం" కార్యక్రమంలో మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రముఖ ఇంజనీర్ గుర్రం కోటిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం గుర్రం కోటిరెడ్డి మెమోరియల్ అవార్డు గ్రహీతలను సన్మానించి అవార్డులు అందజేశారు.ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కరువును ఎదుర్కొనేందుకు ఇంజనీర్లు తమ విలువైన సూచనలు, సలహాలను ప్రభుత్వానికి అందించాలని మంత్రి కోరారు. ఇంజనీర్లు లేనిదే దేశ అభివృద్ధి సాధ్యం కాదని, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో ఇంజనీర్ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.

ఎంజీఎం దుస్థితిపై సీఎం దృష్టి సారించాలి

పెచ్చులు ఊడుతున్నా.. సమస్యలు తీరవా?

వరంగల్ ప్రతినిధి సెప్టెంబర్ 23:

వరుసగా పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి దుస్థితి మారడం లేదని రోగులు, వారి సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ వార్డులో ఘటన తర్వాత కలెక్టర్, డీఎంఈ తదితర అధికారులు ఆస్పత్రిని పరిశీలించినా.. ఆర్ఐసీయూ, ఫిజియోథెరపీ విభాగాల్లోనూ పెచ్చులు ఊడిపడటంతో భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వెయ్యి పడకలు.. ఒక్క లిఫ్ట్!

స్ట్రెచర్లు లేవు.. పరీక్షలు లేవు.. పరికరాలు పనిచేయవు!

రోగులను తరలించేందుకు స్ట్రెచర్లు, సెలైన్ స్టాండ్లు అందుబాటులో లేకపోవడం, ఏడు అంతస్తుల భవనంలో ఒక్క లిఫ్ట్ మాత్రమే పనిచేయడం, రక్త పరీక్షలకు అవసరమైన రసాయనాలు లేకపోవడం, 2డీ ఎకో వంటి పరికరాలు పనిచేయకపోవడం వంటి సమస్యలతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఆపరేషన్ థియేటర్లలో ఏసీలు పనిచేయకపోవడం, నిపుణులైన సిబ్బంది కొరత వంటి సమస్యలపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిస్థితులపై ముఖ్యమంత్రి, వైద్యారోగ్య మంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి సారించి ఎంజీఎంను ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు.



విజయకెరటం
తెలుగు దినపత్రిక

వేములపల్లి ఎడమకాల్వలో నీరు లేకుండా గణేష్ నిమజ్జన ఏర్పాట్లు





వేములపల్లి: సెప్టెంబర్ 23 విజయకేరటం ప్రతినిధి

సాగర్ ఎడమకాల్వ వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను ఎమ్మెల్సీ ఎంసీ కోటి రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, నల్లమోతు భాస్కరరావు పరిశీలించారు. కాలువలో నీరు లేకపోవడంతో అడుగు లోతు నీటిలోనే కొంతమంది వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న పరిస్థితిని చూసి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. వేములపల్లి వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు చెప్పడంతో నమ్మామని, కానీ క్షేత్రస్థాయిలో చూస్తే ఏర్పాట్లలో నిర్లక్ష్యం కనిపిస్తోందని విమర్శించారు. భక్తుల నమ్మకాలకు అనుగుణంగా గణేష్ నిమజ్జనానికి సరైన ఏర్పాట్లు చేయలేదని ఆరోపించారు.నిమజ్జనం కోసం వేములపల్లి కాల్వ వద్దకు వెంటనే నీటిని విడుదల చేసేలా జిల్లా కలెక్టర్ అత్యవసర చర్యలు చేపట్టాలని కంచర్ల భూపాల్ రెడ్డి కోరారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ మాజీ వైర్మన్ మందడి సైదిరెడ్డి, తిప్పర్తి, మాడుగులపల్లి మండల పార్టీ అధ్యక్షుడు పల్‌రెడ్డి రవీందర్ రెడ్డి, బాపయ్య, రావుల శ్రీనివాస రెడ్డి, రాపోలు వెంకటేశ్వర్లు, అశోక్ రెడ్డి తదితర స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

రాయికల్ శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో వేడుకలు

జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

జగిత్యాల జిల్లా ప్రతినిధి , సెప్టెంబర్ 23 (విజయకెరటం) :



ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27న జగిత్యాల జిల్లాలోని రాయికల్ గ్రామం, మండలంలోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పర్యాటక రంగం ప్రాధాన్యత, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి కల్పన, సాంస్కృతిక మార్పిడి, సుస్థిర అభివృద్ధిలో పర్యాటక రంగం పోషించే కీలక పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.2026 సంవత్సరానికి “డిజిటల్ అజెండా, కృత్రిమ మేధస్సుతో పర్యాటక రంగం పునర్‌రూపకల్పన” అనే థీమ్‌ను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పర్యాటక ప్రదేశాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ప్రపంచ పర్యాటక దినోత్సవ నిర్వహణపై ఈ నెల 9న రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో తాను పాల్గొన్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లాలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను రాయికల్‌లోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయం (త్రికూటాలయం)లో నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాల విశిష్టతను ప్రజలకు తెలియజేస్తూ పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని అన్నారు.

హెచ్ఐవీ, టీబీపై విద్యార్థులకు అవగాహన

జిల్లాస్థాయి క్విజ్ పోటీల నిర్వహణ.. విజేతలకు బహుమతులు

వరంగల్, విజయ కెరటం సెప్టెంబర్ 23:

హెచ్ఐవీ/ఎయిడ్స్, టీబీ, రక్తదానం, ఇతర ఆరోగ్య కార్యక్రమాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలను బుధవారం వరంగల్ నగరంలోని మట్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లాలోని 10 పాఠశాలలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రాజి రెడ్డి మాట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్, టీబీ నివారణపై విద్యార్థులకు చిన్ననాటి నుంచే అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమన్నారు. వ్యాధులపై సరైన సమాచారాన్ని తెలుసుకుని, కుటుంబ సభ్యులు, సమాజంలో ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. క్విజ్ పోటీలో మట్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల బృందం ప్రథమ బహుమతి, క్రిస్టియన్ కాలనీ ప్రభుత్వ పాఠశాల బృందం ద్వితీయ బహుమతి సాధించాయి. విజేతలకు డీఎంహెచ్ఓ డాక్టర్ రాజి రెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థుల ప్రతిభను, ఉత్సాహంగా పాల్గొన్న తీరును ఆయన అభినందించారు.యువతలో ఆరోగ్యంపై సరైన అవగాహన పెంపొందించి, తమ పరిసరాల్లో ఆరోగ్య అవగాహన రాయబారులుగా విద్యార్థులను తీర్చిదిద్దడమే కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో డాక్టర్ అరుణ్‌కుమార్ జోషి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ స్వప్న మాధురి, హెచ్ఈఓ శ్రీనివాస్, సూపర్‌వైజర్ రామకృష్ణ, డీఎంఓఓ కమలాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ హౌసింగ్, బలహీన వర్గాల పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వేగవంతం చేయాలి

గోదావరి పుష్కరాలు--2027కు సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలి

వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

జగిత్యాల జిల్లా ప్రతినిధి , సెప్టెంబర్ 23 (విజయకెరటం) :

జిల్లాలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీఓలు, హౌసింగ్ ఏఈలు తదితర అధికారులతో వినాయక నిమజ్జన ఏర్పాట్లు, బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకానికి సంబంధించిన పట్టాలు/పొజిషన్ సర్టిఫికెట్ల పంపిణీ, గోదావరి పుష్కరాలు--2027 సన్నద్ధతపై సమీక్షించారు.వినాయక నిమజ్జన ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలను అధికారులు ముందుగానే పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో బారికేడ్లు, విద్యుత్ దీపాలు, తాగునీరు, పారిశుధ్యం, క్రేన్లు, గజ ఈతగాళ్లు, వైద్య బృందాలు, అగ్నిమాపక వాహనాలు తదితర ఏర్పాట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.జిల్లాలో బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకం కింద అందుబాటులో ఉన్న 29,134 పట్టాలు/పొజిషన్ సర్టిఫికెట్లను సంబంధిత రికార్డులతో క్షుణ్ణంగా సరిచూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే లబ్ధిదారులకు అందజేసినవి, ప్రస్తుతం అందుబాటులో ఉన్నవి, ఇంకా పంపిణీ చేయాల్సిన వాటి వివరాలను మండలాలు, మున్సిపాలిటీల వారీగా నిర్ధారించాలన్నారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నివేదికల్లో ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా తహసీల్దార్లు వ్యక్తిగతంగా పరిశీలించి ధ్రువీకరించాలని స్పష్టం చేశారు.గోదావరి పుష్కరాలు--2027కు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పుష్కర ఘాట్లు, చేరుకునే రహదారులు, పార్కింగ్ ప్రదేశాలు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల వసతి తదితర అవసరాలను గుర్తించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. అవసరమైన పనులను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, అంచనాలు సిద్ధం చేసి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.



వైద్యారోగ్య మంత్రి ఎంజీఎంకు రావాలి

వరుస ఘటనలపై ప్రజల ఆందోళన.. ఆస్పత్రి దుస్థితిపై ప్రశ్నలు

వరంగల్ విజయ కెరటం సెప్టెంబర్ 23 :

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వరుసగా చోటుచేసుకుంటున్న ఘటనలతో రోగులు, వారి సహాయకుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల ఆరోగ్యశ్రీ వార్డులో స్లాబ్ పెచ్చులు ఊడిపడి రోగులు, సహాయకులు, పారిశుధ్య సిబ్బంది గాయపడిన ఘటన మరువకముందే ఆర్ఐసీయూ, ఫిజియోథెరపీ విభాగాల్లోనూ పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. ఈ ఘటనల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సత్యశారద, డీఎంఈ డాక్టర్ వాణి తదితరులు ఆస్పత్రిని పరిశీలించి అధికారులతో వివరాలు తెలుసుకున్నారు.అయితే ఉన్నతాధికారులు తనిఖీలు చేసిన తర్వాత కూడా ఆస్పత్రిలో సమస్యలు కొనసాగడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోగులను తరలించేందుకు అవసరమైన స్ట్రెచర్లు అందుబాటులో లేకపోవడం, సెలైన్ స్టాండ్లు కనిపించకపోవడం, ఏడు అంతస్తుల భవనంలో వెయ్యి పడకలకు ఒక్క లిఫ్ట్ మాత్రమే పనిచేయడం వంటి సమస్యలు రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. రక్త పరీక్షలకు అవసరమైన రసాయనాలు అందుబాటులో లేకపోవడంతోపాటు 2డీ ఎకో వంటి వైద్య పరికరాలు పనిచేయడం లేదని అంటున్నారు.ఇక ఆపరేషన్ థియేటర్లలో ఏసీలు లేకపోవడం, ఉన్నవి పనిచేయకపోవడం, అవసరమైన శస్త్రచికిత్సలు సక్రమంగా జరగకపోవడం, నిపుణులైన సిబ్బంది కొరత తదితర సమస్యలు ఉన్నాయని రోగులు, వారి బంధువులు వాపోతున్నారు. రోజుకు వేలాది మంది ఔట్‌పేషెంట్లు, వందలాది మంది ఇన్‌పేషెంట్లు వచ్చే వెయ్యి పడకల ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఒకప్పుడు నాలుగు ఉమ్మడి జిల్లాల ప్రజలకు ప్రధాన వైద్య కేంద్రంగా పేరొందిన ఎంజీఎం ప్రస్తుతం మౌలిక వసతుల సమస్యలతో సతమతమవుతోందని పలువురు పేర్కొంటున్నారు. వరుస ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్వయంగా ఎంజీఎంను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం అధికారుల తనిఖీలకే పరిమితం కాకుండా ఆస్పత్రిలోని అన్ని విభాగాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి, అత్యవసరంగా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.



నిమజ్జన ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి: కలెక్టర్







నల్గొండ, సెప్టెంబర్ 23:

వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ప్రథమ చికిత్స సౌకర్యాలతో పాటు అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.బుధవారం చిట్యాల మండలం పెదకాపర్తి చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జన ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. నిమజ్జనానికి వినియోగించే క్రేన్లు, వాహనాలు, బ్యారికేడింగ్, పారిశుద్ధ్య సిబ్బంది, గజ ఈతగాళ్లు, బోట్లు, ప్రథమ చికిత్స కేంద్రాలను పరిశీలించారు.ప్రథమ చికిత్స కేంద్రంలో ఏర్పాటు చేసిన మందులను పరిశీలించిన కలెక్టర్.. నిమజ్జనం సందర్భంగా అనుకోని ప్రమాదాలు సంభవించినట్లయితే వెంటనే ప్రథమ చికిత్స అందించేలా బ్యాండేజ్, అయోడిన్‌తో పాటు అవసరమైన ఇతర మందులను సిద్ధంగా ఉంచాలని సూచించారు.విగ్రహాల నిమజ్జనం అనంతరం పత్రి, పూలు, ఇతర వ్యర్థాలను చెరువులో వేయకుండా డస్ట్‌బిన్లలో వేసేలా భక్తులకు అవగాహన కల్పించాలని చెప్పారు. శానిటేషన్ సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు సేకరించి బయటకు తరలించాలని ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో ఘనంగా గణేష్ నిమజ్జనం

విజయ కెరటం ప్రతినిధి :

తిప్పర్తి మండలం జంగారెడ్డిగూడెం గ్రామంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా గ్రామ యువత భారీ ఎత్తున ఏర్పాట్లు చేసి నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కోలాటం భజన వంటి సాంస్కృతిక నృత్యాలతో స్వామివారిని ఊరేగింపుగా తీసుకెళ్లి న అనంతరం లడ్డు వేలం నిర్వహించి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాసరి జానయ్య, జర్నలిస్ట్ యూనియన్ నాయకుడు సిర్సవాడ గిరి యువత తండు సైదులు, మహేందర్, బొడ్డుపల్లి గణేష్, దుర్గా ప్రసాద్, పోలిపోయిన కిరణ్ కుమార్, శివ ప్రసాద్, ముచ్చపోతుల జానయ్య, పరమేష్, వెంకట్ రాములు, రాము, పలువురు యువకులు పాల్గొన్నారు.



Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528